ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 32
సంచిక : 32
పేజీలు : 3
శుక్రవారం, సెప్టెంబర్ 05, 2025
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## ఏసీబీకి చిక్కిన మత్స్య శాఖ అధికారిణి..



**టి మీడియా,సెప్టెంబర్ 4,హైదరాబాద్ :** నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా మత్స్య శాఖ అధికారిణిగా పని చేస్తున్న ఎం చరిత రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీలో కొత్త సభ్యుల పేర్ల నమోదుకు అవకాశం కల్పించాలని కోరగా, అందుకు ఆమె లంచం డిమాండ్ చేశారు. ఇవాళ బాధితుడి నుంచి రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా చరిత రెడ్డిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమెను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

# అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

## -జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి - నాణ్యతతోమార్కెట్ పునఃనిర్మాణం



**టీ మీడియా, సెప్టెంబర్ 4, ఖమ్మం :**వ్యవసాయ మార్కెట్ ను మోడల్ మార్కెట్ గా చేపట్టిన పునఃనిర్మాణ అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, రైతులకు అవసరమైన వసతుల కల్పనపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ పునఃనిర్మాణం చేపట్టిన ఆధునిక నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు.కలెక్టర్ వ్యవసాయ మార్కెట్ పరిసరాలలో తిరుగుతూ పనుల పురోగతిని మార్కెట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులకు సంబంధించి మ్యాప్ లను పరిశీలించి, చేపట్టాల్సిన పనులపై పలు సూచనలు చేశారు. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని వారికి కావాలసిన సౌకర్యాల ఏర్పాట్లలో ఏలాంటి రాజీ పడవద్దని కలెక్టర్ స్పష్టంగా ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి నిపుణుల కమిటీ సూచనల ప్రకారం చేసిన డిజైన్ ల ప్రకారం నిర్మాణం పక్కాగా జరగాలని, రైతులకు ఇబ్బందులు కలగవద్దని మంత్రివర్యులు నిధులు మంజూరు చేశారని, పనులు నాణ్యతతో సకాలంలో పూర్తయ్యేలా చూడాలని అన్నారు. రైతుల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతతో పనులు పూర్తి చేయాలని, ఏజేన్సీ వారు అదనపు బృందాలు ఏర్పాటుచేసుకొని, వ్యవసాయ సీజన్ లోగా పనులు పూర్తి చేయాలని అన్నారు.రైతుల వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, వివరాలు తెలిపేలాగా ఎల్ఈడీ బోర్డులు, విశాలమైన పెద్ద పెద్ద షెడ్ లు, సరుకు నాణ్యత తెలిపే గ్రిడింగ్ యంత్రాలు, తేమశాతం నిర్ధారించే మిషన్లు, స్వచ్ఛమైన త్రాగునీటి కోసం ఆరు ప్రాంతాలలో ఆర్ఓ వాటర్ ప్లాంట్లు, నాలుగు టాయిలెట్ కాంపెక్స్ లు, రైతుల ఆరోగ్య సమస్యలకు హెల్త్ సెంటర్, ఇస్కాన్ సహకారంతో రుచికరమైన భోజన వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వివరించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ హనుమంతరావు, వైస్ చైర్మన్ రమేష్, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దారు సైదులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ ఆర్టీఏ అధికారులు అరెస్ట్

**టీ మీడియా సెప్టెంబర్ 4, ఖమ్మం రూరల్ :** ఆర్టీఏ అధికారులమని పేర్కొంటూ జాతీయ రహదారిపై దోపిడీకి పాల్పడుతున్న పలువురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన గురువారం ఖమ్మం రూరల్ మండలంలో చోటుచేసుకుంది. ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ ముష్కరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. గత కొద్ది రోజులుగా నలుగురు వ్యక్తులు ఓ ముఠాగా ఏర్పడి ఆర్టీఏ అధికారులుగా చలామణి అవుతూ జాతీయ రహదారిపై వాహనాలను ఆపుతూ దారి దోపిడికి పాల్పడుతున్నట్లు తెలిపారు.ఖమ్మంలో రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన కత్తుల మోహన్, ఏదులాపురం మున్సిపాలిటీకి పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డుకు చెందిన ఆత్కూరి నవీన్, కూసుమంచి మండలం బోడియ తండాకు చెందిన జాటోత్సాగర్, ఆదిలాపురం మున్సిపాలిటీ పరిధిలోని భారీ కూడానికి చెందిన దంతాల వెంకట్ నారాయణ ముఠాగా ఏర్పడి దారి దోపిడీకి పాల్పడుతున్నట్లు చెప్పారు. రెండు రోజుల క్రితం సూర్యాపేట జిల్లాకు చెందిన శ్రీశైలం అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ అనంతరం కేసు నమోదు చేసి ఖమ్మం జైలుకు తరలించారు. ముఠా సభ్యులు గతంలో తిరుమలయపాలెం మండలంలో హోటల్ నిర్వాహకుడిని బెదిరించి రూ.8 వేలు కాజేసినట్లు పోలీసులు తెలిపారు.

# రైతాంగ పోరాట వార్షికోత్సవ సభ

## పెద్ద ఎత్తున పాల్గొనాలి

## -సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**టీ మీడియా సెప్టెంబర్ 4,నల్లగొండ :** వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. గురువారం నల్లగొండలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్రోద్యమంలో గాని, వీర తెలంగాణ సాయుధ పోరాటంలో గాని బీజేపీ నాయకులు ఎవరూ పాల్గొనలేదన్నారు. ప్రజల చరిత్రను వక్రీకరించడంలో బీజేపీ అందవేసిన చేయిగా ఉందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను హిందూ ముస్లిం పోరాటంగా చిత్రీకరించడాన్ని తప్పుపట్టారు. ఆ పోరాటమంతా దున్నేవాడికే భూమి, స్వేచ్ఛ కోసం పోరాటం అన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవాలను సెప్టెంబర్ 10 నుండి 17 వరకు తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్నామని, వార్షికోత్సవ సభలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా పెండింగ్ ప్రాజెక్ట్ అయినా శ్రీశైలం సొరంగం మార్గం పనులను ప్రారంభించాలని, కాల పరిమితి నిర్ణయించి పూర్తి చేయాలన్నారు.శాసనసభలో వెనకబడిన తరగతులకు 42% రిజర్వేషన్ల చట్టం చేసి గవర్నర్ దగ్గరకు పంపినా, గవర్నర్ వెంటనే సంతకం చేయాలని అఖిలపక్ష పార్టీలు కోరినా నిర్ణయం తీసుకోకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. గతంలో కూడా రాష్ట్ర ప్రభుత్వాలు గవర్నర్ దగ్గరికి పలు సవరణలు, చట్టాలు పంపినా సంతకాలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బంది పెడుతున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రిజర్వేషన్లపై కూడా గతంలో మాదిరిగా కాకుండా వెంటనే సంతకం చేయాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో జరిగిన నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక అంచనా వేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించిందని, నివేదించిన ప్రకారం కేంద్ర ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం కింద నిధులను విడుదల చేయాలని కోరారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం పట్టు విడిచి నిధులను కేటాయించాలన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై ఎన్‌డీఏ నేతలు ముఖ్యంగా బీజేపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు, ప్రజాతంత్ర వాదులు తీవ్రంగా ఖండించాలన్నారు.
వ్యక్తిగత విమర్శలు చేయవద్దని హితవు పలికారు.

**యూరియా కొరత లేకుండా చూడాలి**

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో యూరియా



కొరత అత్యధికంగా ఉన్నదని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి రైతాంగానికి యూరియా కొరత లేకుండా బాధ్యత తీసుకునే విధంగా ప్రభుత్వం వ్యవహరించాలని వారు సూచించారు. అదేవిధంగా భారతదేశం మీద అమెరికా చేస్తున్న ఒత్తిడి ప్రమాదకరమని భారత దేశ సరుకుల మీద 50 శాతం సుంకాలు విధించడం అమెరికా ప్రభుత్వం చేస్తున్న బ్లాక్‌మెయిల్ అన్నారు. అమెరికా చేస్తున్న బ్లాక్ మెయిల్ పై ప్రధాని మోదీ ఎందుకు ఖండించడం లేదని, నోరు మెదపకుండా ఉన్నారని వారు ప్రశ్నించారు. ఇండియా, చైనా, రష్యా దేశాల మధ్య స్నేహ సంబంధాలు ఆహ్వానించదగ్గ పరిణామాలన్నారు. ఈ సంబంధాలు, సహకారం బలోపేతం అయితే అమెరికా మెడలు వంచవచ్చని అన్నారు.

**చెరువులు, కుంటలు నింపాలి**

సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ, ఏఎంఆర్‌పీ బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు కింద ఉన్న అన్ని చెరువులను, కుంటలను నింపాలన్నారు. యూరియా కొరత తీవ్రంగా ఉందని, రైతులు షాపుల చుట్టూ రోజుల తరబడి తిరుగుతున్నా ఒక్కటి, రెండు బస్తాలు కూడా దొరకడం లేదన్నారు. అధికారులు, మంత్రులు మాత్రం యూరియా కొరత లేదని ప్రకటించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇటీవల కాలంలో కురిసిన వర్షాల వల్ల జిల్లాలో అనేక ప్రాంతాల్లో రోడ్లు, కల్వర్టులు, చెక్ డ్యాములు దెబ్బతిన్నాయని, కొన్ని పంటలకూ నష్టం జరిగిందని, జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి ప్రభుత్వం, అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో సర్వే జరిపి, నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారి ఐలయ్య, డబ్బికారి మల్లేశం, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, సయ్యద్ హాశం, పాలడుగు ప్రభావతి, చిన్నపాక లక్ష్మీనారాయణ, వీరపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మహా అన్నదానం

### అధిక సంఖ్యలో హాజరైన భక్త జనం



**టీ మీడియా సెప్టెంబర్ 4 ముదిగొండ**
మండలంలోని వెంకటాపురం గ్రామంలో శ్రీ బాల గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద గురువారం మహా అన్నదానం కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిధులుగా ఎస్ఐ జి.హరిత, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందుల బాలచందర్ హాజరై స్వామి వారికి పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఈ కార్యక్రమం నిర్వహించిన కమిటీ సభ్యులు, అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలకు ప్రతేక కృతజ్ఞతలు చెప్పారు. రేపు జరగబోయే నిమజ్జనం కార్యక్రమానికి ఎటువంటి లోపాలు జరగకుండా విజయవంతంగా జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు, గ్రామస్తులు, కమిటీ సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.




## బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చెయ్యాలి

### ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

### డీవైఎఫ్ఐ నేత చింతల రమేష్

**టీ మీడియా, సెప్టెంబర్ 04, సింగరేణి (కారేపల్లి) :**
స్టీల్ ప్లాంట్ కు కావలసిన వనరులు ఉన్న బయ్యారం లో ఉక్కు పరిశ్రమ నెలకొల్పి ఈప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతల రమేష్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం కారేపల్లి లో డివైఎఫ్ఐ కారేపల్లి మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్ అధ్యక్షతన కారేపల్లి మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చింతల రమేష్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం,రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిరుద్యోగులకు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అవుతున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది లోపు 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్, నెలకు రూ. 4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్న అమలు చేయడం లేదన్నారు., జిల్లాలో మాదారం డోలమైట్ మైన్స్ ను అభివృద్ధి చేసి, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీలను నిర్మించాలని యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశాడు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం డీవైఎఫ్ఐ ఉద్యమించనున్నట్లు తెలిపారు. అగస్టు 31న ఖమ్మంలో జరిగిన డి.వై.ఎఫ్.ఐ ఖమ్మం జిల్లా మహాసభలలో నిరుద్యోగుల, యువత, విద్యార్థుల సమస్యలపై అనేక తీర్మానాలు చేశామన్నారు. మహాసభల జయప్రదానికై సహకరించిన ప్రతి ఒక్కరికి డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ మండల నాయకులు ఆదేర్ల రమేష్, మెట్టెగనపుల సాంబ, గజ్జెల సంపత్, చినుముల కమలాకర్, ధబడం పవన్ తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల, మేకల దొంగల అరెస్టు

### చోరీ సొత్తు స్వాధీనం




**టీ మీడియా సెప్టెంబర్ 04, సింగరేణి(కారేపల్లి) :**
కారేపల్లి మండలంలో గొర్రెలు, మేకలు, కోళ్ళ ను దొంగిలిస్తున్న వ్యక్తులను కారేపల్లి పోలీసులు గురువారం పట్టుకున్నారు. దీనికి సంబంధించి కారేపల్లిలో సీఐ తిరుపతిరెడ్డి కేసు వివరాలను విలేకరులకు వివరించారు. కారేపల్లి ఎస్సై బైరు గోపి ఆధ్వర్యంలో పోలీసులు గురువారం ఉదయం ఉసిరికాయలపల్లి సింగరేణి ఓసి మూలమలుపు వద్ద వాహనాలు తనిఖీ చేయుచుండగా ఇల్లందు ఓసి గుట్ట నుండి అనుమానస్పదంగా ఒక ఆటో, రెండు బైకులు రావడంతో వాటిని ఆపి తనిఖీ చేయగా ఆటోలో ఒక గొర్రెపోతు ఉన్నది. అనుమానంతో వారిని విచారించగా దూడిమెట్ల శివయ్య, ఎల్లబోయిన సురేష్, ఎల్లవుల గోపి, జంగిడి ప్రకాష్ నలుగురు కలిసి గత కొద్ది రోజుల నుండి ఉసిరికాయలపల్లి, సీతారాంపురం, శాంతినగర్ గ్రామాలలో చుట్టుపక్కల ప్రాంతాలలో మేక పోతులు గొర్రెలు మరియు గొర్రె పోతులు కోళ్ల లను దొంగతనాలు చేసి వాటిని ఇల్లందు మరియు టేకులపల్లి ఏరియా లో గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మకం చేస్తున్నట్లు తెలిపారు. గొర్రెపోతును అమ్ముకుందామని తీసుకెళ్తున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుండి 4 కేసులకు సంబందించిన ప్రాపర్టీ తో పాటు ఆటో, రెండు మోటార్ సైకిల్, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసినట్టు తెలిపారు. స్వాదీనపర్చుకున్నట్లు సీఐ తిరుపతిరెడ్డి తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం జ్యుడీషియ కస్టడీ కి తరలించినట్లు తెలిపారు.

# వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

### - జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**టీ మీడియా, సెప్టెంబర్ 4,భద్రాద్రి కొత్తగూడెం :**
భద్రాచలం పట్టణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా, శాంతియుతంగా, సురక్షితంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు.గోదావరి నది తీర ప్రాంతంలో నిమజ్జన ఘాట్‌ల వద్ద లాంచీలు బారికేడింగ్, లైటింగ్, సీసీ కెమెరాల పర్యవేక్షణ, తాగునీరు, వైద్య బృందాలు, గజ ఈతగాళ్లు వంటి అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వివరించారు. నదీ తీర ప్రాంతంలో ఎటువంటి అపశృతి జరగకుండా విస్తృత భద్రతా చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ భక్తులకు, గణేశ మండపాల నిర్వాహకులకు ముఖ్య సూచనలు చేశారు. వినాయక విగ్రహాల ఊరేగింపులో భక్తులు క్రమశిక్షణతో వ్యవహరించాలని, పెద్ద సంఖ్యలో గుంపులు ఏర్పడి అల్లర్లు చేయకుండా శాంతియుతంగా ఊరేగింపులు నిర్వహించాలన్నారు. ఊరేగింపుల సమయంలో డీజేలు, అధిక శబ్దపూరిత మ్యూజిక్ వాడకూడదని, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించకుండా మున్సిపల్, పోలీస్ శాఖల సూచనల మేరకు మాత్రమే ఊరేగింపులు కొనసాగించాలన్నారు.నిర్దేశించిన ప్రదేశాలలోనే వినాయక నిమజ్జనం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వాహనాలను నిర్దిష్ట పార్కింగ్ ప్రాంతాల్లోనే నిలపాలని, చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు నదీ ఘాట్ ప్రాంతంలో జాగ్రత్తలు పాటించాలని భక్తులకు సూచించారు. మద్యం సేవించి నిమజ్జన కార్యక్రమాలకు రాకూడదని, విగ్రహాల నిమజ్జనం క్రమపద్ధతిలో జరగాలని ఆయన హెచ్చరించారు.జిల్లా ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో, శాంతియుతంగా వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**టి మీడియా, సెప్టెంబర్ 4,పినపాక ప్రతినిధి:**
మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు పాల్గొని ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 14,80,000 రూపాయల విలువైన చెక్కులను 31 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అద్దంకి నరేష్ , ఎంపీడీవో శ్రీనివాసరావు , ఎంపీఓ వెంకటేశ్వరరావు , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నవీన్ , మండల మహిళా అధ్యక్షురాలు సౌజన్య , మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దొడ్డ రమేష్ కు గురు బ్రహ్మ అవార్డు



**టి మీడియా, సెప్టెంబర్ 4,పినపాక ప్రతినిధి:**
మారుమూల గిరిజన గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులను ఏకలవ్య, నవోదయ, రెసిడెన్షియల్, గురుకుల పాఠశాలల ప్రవేశాలకు తోడ్పాటునందించిన అశ్వాపురం మండల కేంద్రంలోని రవీంద్ర పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ దొడ్డ రమేష్ సేవలను గుర్తించిన శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ వారు రాష్ట్రస్థాయి 2025 సంవత్సర ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురుబ్రహ్మ అవార్డుకు ఎంపిక చేశారు. బుధవారం హైదరాబాద్ లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం లో జరిగిన ప్రధానోత్సవ కార్యక్రమంలో లోక్ సత్తా వ్యవస్థాపకులు, విద్యావేత్త జయప్రకాష్ నారాయణన్ చేతుల మీదుగా గురుబ్రహ్మ అవార్డును దొడ్డ రమేష్ కు అందజేశారు. గురుబ్రహ్మ అవార్డును అందుకున్న దొడ్డ రమేష్ కు బంధువులు, స్నేహితులు, మండల ప్రజలు అభినందనలు తెలియజేశారు.

## మహోన్నతమైన సేవ.. ఉపాధ్యాయ వృత్తి

### - మాజీ ఎంపీ నామ



**టి మీడియా,సెప్టెంబర్ 4,ఖమ్మం:**
భారతదేశ మాజీ రాష్ట్రపతి, విద్యావేత్త, తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా సెప్టెంబర్ ఐదు న దేశవ్యాప్తంగా గురుపూజోత్సవం తో పాటుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్న తరుణాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు గురువారం మీడియాకు ప్రకటన విడుదల చేశారు. తల్లిదండ్రుల తర్వాత సమాజంలో అత్యున్నత స్థానం గురువులదని, మనకు మార్గనిర్దేశం చేసే వారు గురువులేనన్నారు. ఒక మంచి గురువు తరం భవిష్యత్తును తీర్చిదిద్దగల శక్తి కలిగి ఉంటారని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారు తన ఆలోచనలతో, తత్వబోధనలతో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని గుర్తుచేశారు. ఆయన పాఠాలు, తత్వాలు నేటికీ సమాజాన్ని మార్గనిర్దేశం చేస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు గురువుల పట్ల మరింత గౌరవం చూపాలని, పాఠశాలలు, కళాశాలలు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసానికి వేదికలగా మారాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయుల సంక్షేమానికి మరిన్ని చర్యలు చేపట్టాలని కోరారు. డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ లెర్నింగ్ పెరిగిన, జీవన విలువలను అందించేది గురువులే అని, గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న గురువులకు మరింత ప్రోత్సాహం అందించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఒక మహోన్నతమైన సేవ అని మన సమాజ అభివృద్ధి, దేశ ప్రగతికి కోసం విద్యా వెలుగులు పంచుతున్న గురువులకు నామ తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.




## ట్రాక్టర్ డ్రైవర్ కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

### -సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు

**టి మీడియా, సెప్టెంబర్ 4,ఖమ్మం**
:మంచికంటి భవనంలో ట్రాక్టర్ డ్రైవర్ యూనియన్ ఇ-475 జిల్లా మహాసభ నిర్వహించడం జరిగింది. ఈ మహాసభను ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ట్రాక్టర్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్న డ్రైవర్లకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఆరోగ్యరిత్యా గాని వేతనాల దృశ్య గాని ఎలాంటి చట్టాలను చేయడం లేదని ఆరోపించడం జరిగింది. తదనంతరం ట్రాన్స్పోర్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వై విక్రం మాట్లాడుతూ ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్న డ్రైవర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతన జీవో ప్రకారం 26 వేల రూపాయలు ఇవ్వాలని అలాగే 50 సంవత్సరాలు పైబడిన డ్రైవర్లకు పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేయడం జరిగింది.చివరగా ట్రాన్స్పోర్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి జిల్లా ఉపేందర్ మాట్లాడుతూ అనేక పోరాటాలు చేసిన రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు కు అనుకూలమైన చట్టాలు చేస్తూ డ్రైవర్లకు పెనాల్టీలు పెంచుతూ జైలు శిక్షలు పెంచుతూ కొత్త కొత్త చట్టాలు చేయడం జరుగుతుంది కానీ డ్రైవర్ల కోసం చేసిన చట్టాలు ఏమాత్రం లేవని వారికి సంక్షేమం కోసం చట్టాలు చేయాలని ఈ మహాసభల సందర్భంగా డిమాండ్ చేశారు.అనంతరం ట్రాక్టర్ యూనియన్ జిల్లా నూతన కమిటీ ఏనుకోవడం జరిగింది.గౌరవ అధ్యక్షులుగా వై విక్రమ్ గౌరవసలహాదారులు జిల్లాఉపేందర్జిల్లాఅధ్యక్షకార్యదర్శులుగా గుర్రం సతీష్, ధరావత్ రాందాస్, ఉపాధ్యక్షులుగా నూకల నరేష్, జొన్నలగడ్డ రమణ, సాయ కార్యదర్శిగా బీమా, కోశాధికారి లక్ష్మణ్, మరియు అమరయ్య అడ్డా ప్రెసిడెంట్ గా కోటి, కార్యదర్శిగా శివ, లోకల్ అడ్డా ప్రెసిడెంట్ గా వెంకన్న, రమణ కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.

## నేను తోపుడు బండిని.. నా ధర రూ.8వేలు..

### పంచాయతీలో సేవకు సిద్ధంగా ఉన్నా

**టి మీడియా,సెప్టెంబర్ 4,ములుగు:** 'నేను తోపుడు బండిని.. నా ధర రూ.8వేలు.. మన గ్రామంలో మంచి మనసున్న దాతలు ముందుకు వస్తే మన గ్రామ పంచాయతీకి వెళ్లి సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నాను' అనే ఫ్లెక్సీని ములుగు జిల్లా వెంకటాపురం(ఎం)లో వెలసింది. దీనిని స్వయంగా పంచాయతీ కార్యదర్శి ఏర్పాటు చేయడం గ్రామపంచాయతీల్లో నిధుల లేమికి అద్దంపడుతున్నది.వెంకటాపురం (ఎం) గ్రామ కార్యదర్శి చందూలాల్ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ఫ్లెక్సీని స్వయంగా కట్టారు. అంతటితో ఆగకుండా మండల కేంద్రంలోని పలు కూడళ్లలో కూడా సిబ్బందితో ఫ్లెక్సీలను ఏర్పాటుచేసి వాట్సాప్ గ్రూప్‌లో సైతం ఫొటోలు అప్‌లోడ్ చేశారు. దీంతో ఓ పంచాయతీ కార్యదర్శి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిధులు లేవంటూ ఫ్లె క్సీలు కట్టడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. గ్రామ పంచాయతీలో తోపుడు బండి కొనేందుకు రూ.8 వేలు కూడా లేవా అంటూ సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సొంత నియోజకవర్గం, అదీ ఆమె సొంత శాఖలోనే నిధులు లేవా అంటూ విపక్షాలు మండిపడుతున్నాయి.మిమ్మల్ని వ్యవసాయం ఎవడు చేయమన్నాడు!

